# మధుర భావన – 2

''ఇందాకనే దామోదరం అంకుల్ వాళ్ళబ్బాయినీ, కోడల్నీ అందరూ ఆశీర్వదించే కార్యక్రమం ఉంటుందని, ఆ తర్వాత భోజనాలని చెప్పారు. మనం అందరం ఒకచోట కూర్చుందాం... రండి...'' అంటూ సుమజ స్టేజికి ఎదురుగా అక్కడున్న కుర్చీల వైపు దారితీసింది.

అందరూ ఆమెని వెంబడించి వెళ్ళి ఒక్కచోటే కూర్చున్నారు.

''నేనిక్కడకు వచ్చినపుడు దామోదరంగారే ఎదురొచ్చి పలుకరించి, ఏవో రకరకాల పోటీ కార్యక్రమాలు సరదాగా ఏర్పాటు చేశామని చెప్పి, పిల్లలు మీరంతా తప్పకుండా పాల్గొనాలని చెప్పారు.

వాళ్ళబ్బాయి పెళ్ళితో పాటూ ఈ తోటలో కట్టించిన రెండు గెస్ట్ హవుస్ లనూ గ్రహప్రవేశంలా ప్రారంబించే పని కూడా పెట్టుకున్నట్లున్నారు. బాగా దగ్గిర వాళ్ళనీ, స్నేహితులు కొంతమందిని కుటుంబాలతోనూ పిలుస్తున్నానని చెప్పారు. పెళ్ళి ఎక్కడో జరగటం వలన ఇక్కడి వాళ్ళని ఇలా పిలిచి రెండు రోజులు ఆతిథ్యం ఇస్తున్నారన్నమాట!'' అంటూ అటూ ఇటూ చూసి వంశీ ''ఏర్పాట్లన్నీ బాగా ఘనంగా చేశారు కదూ...?'' అన్నాడు పక్కనే కూర్చున్న సుమజతో.

అవునన్నట్లు తల వూపింది

ఇంతలో స్టేజి మీదకు వచ్చిన వధూవరులు సింహాసనాల్లాంటి కుర్చీలపై కూర్చున్నారు.

పెళ్ళికొడుకు పెద్ద తమ్ముడు వచ్చి తనని పరిచయం చేసుకుని పెద్దలంతా వచ్చి అక్షింతలతో వధూవరులని ఆశీర్వదించమని కోరాడు.

తరువాత ఒక చిన్న విన్నపమంటూ చెప్పాడు. ''శుభాకాంక్షలు తెలియజేయాలనుకున్న యువతీ యువకులు మీకు ఇవ్వబడిన కాగితాలపై రాసి ఇవ్వండి. మీ పేరును క్రింద రాయటం మాత్రం మర్చిపోకండి'' అంటూ చిన్నగా నవ్వి మళ్ళీ చెప్పాడు. ... '' చీటిలను మీ దగ్గరకు తీసుకువచ్చిన టిన్ లో వేయండి. మామూలుగా శుభాకాంక్షలని మాత్రమే కాకుండా కొంచెం వినూత్నంగా తెలియజేసిన వారికి ఓ బహుమతి  కూడా ఉంటుంది. సాయంకాలం జరిగే కార్యక్రమాల వివరాలను మా ఇంకో తమ్ముడు శేఖర్ చెబుతాడు'' అంటూ స్టేజి దిగి వెళ్ళిపోయాడు.

వెంటనే శేఖర్ అనబడే యువకుడు వచ్చాడు. సాయంకాలం అందరికీ నవ్వుల విందును ఇవ్వాలనుకునే అభిప్రాయంతో ఒక కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పాడు.

ఎవరైనా స్వంతంగా గానీ, లేక తాము చదివిన, గుర్తు ఉన్న ఏవైనా హాస్య సంభాషణలను ఒక్కరుగా వివరించడం లేదా ఇద్దరు కలిసి చెప్పటం... స్టేజి మీదకు వచ్చి చేయాలని కోరాడు. అలాంటివి ఆలోచించుకుని నిర్ణయించుకోమని విన్నవిస్తున్నానని చెప్పాడు.

తరువాత పెద్దవాళ్ళు అందరూ వెళ్ళి వధూవరులని అక్షింతలతో ఆశీర్వదించి వచ్చారు.

కొంతమంది చిన్నవాళ్ళు తమకి ఇవ్వబడిన కాగితాలపై ఏదో రాసి ఒక చిన్నబ్బాయి తమ వద్దకు పట్టుకువచ్చిన డబ్బాలో ఆ చీటీలను వేశారు.

సాయంకాలం నిర్వహింపబడిన కార్యక్రమంలో చాలామందే ఉత్సాహంగా పాల్గొన్నారు.

కొందరు పిల్లలు ఇద్దరిద్దరుగా వచ్చి జోక్స్ అభినయించి చూపారు. కొంతమంది భార్యాభర్తలూ ఉత్సాహంగా ఆ స్టేజి మీదకు వచ్చి హాస్య సంభాషణలను చెప్పి అందర్నీ నవ్వించారు. అలా ఓ నలుగురుదైగురు జంటలుగా వచ్చి జోక్స్ ని అభినయించారు. అలా ఆ ప్రాంగణం అంతా నవ్వులతో మార్మోగింది.

బహుమతి పొందిన జోక్స్ ఇలా ఉన్నాయి.

ఒక పెద్దాయనా, ఒక చిన్న అబ్బాయీ స్టేజి పైకి వచ్చారు. వారిద్దరి మధ్యా సంభాషణా ఇలా జరిగింది.

''బాబూ... నువ్వు... సంగీత సామ్రాట్టు సోమశేఖరంగారి మనవడివి కదూ... ప్రస్తుతం ఏం చేస్తున్నావూ...?''

''చదువుకుంటూ సంగీత సాధనా చేస్తున్నానండీ... ఈ మధ్యనే మా తాతగారు నా పాట విని నగదు బహుమతినీ ఇచ్చారు...!''

''అవునా... పువ్వు పుట్టగానే పరిమళిస్తుందంటారన్నమాట నిజమే! చాలా సంతోషం!''

''కానీ... ఆ డబ్బును బహుమతిగా ఇస్తూ... తాతగారొక మాట అన్నారు. అది మాత్రం నాకు అర్థం కాలేదండీ... నేను ఇంట్లో ఉండగా ఎపుడూ పాడకు. నీకు పాడాలని కోరిక కలిగితే, ఎవరూలేని మైదానంలోకి వెళ్ళి పాడు...' అన్నారండీ. ఆ మాటలకు అర్థం ఏమిటంటారు...?''

ఆ మాటలకు ఆ పెద్దాయన తల పట్టుకున్నాడు!

ఇక రెండవది.....

ఆ పిల్లవాడు అన్నాడు. ''ఈ మధ్య మా అమ్మ స్నేహితురాలి పుట్టిన రోజు కార్యక్రమంలో నేనో పాట పాడానండీ. మా అమ్మ తన పక్కనున్న వాళ్ళందరితో ఎంత ఎక్కువ ఫీజు ఇచ్చి నాకు సంగీతం నేర్పిస్తున్నదో... గొప్పగా వివరించింది. వింటూన్న ఆవిడ తన పక్కనున్న ఆవిడను మా అమ్మకు చూపించి 'ఈవిడో గొప్ప లాయరు. ఆటీచరు మీద కేసు వేసి మీకా ఫీజు తిరిగివచ్చేట్లుగా చూస్తుంది. ఆ టీచరు అడ్రసు చెప్పండి' అనడిగింది. ఆ మాటలూ నాకు అర్థంకాలేదు. ఏమిటంటారూ...?''

ఆమాటలకు ఆ పెద్దాయన తెల్లమొహం వేసాడు.

ఎక్కడో చదివిన ఈ జోక్స్ కి చిన్న చిన్న మార్పులు చేసి ప్రదర్శించామని వాళ్ళు చెప్పడం జరిగింది. అందర్నీ ఎక్కువగా నవ్వించిన ఈ జోక్స్ చెప్పిన వాళ్ళని స్టేజి మీదకు పిలిచి రెండు పాకెట్స్ బహుమతులుగా అందించారు.

అలాగే ఇంకొకటి....

ఒకరు ' మా ఇంటి వాచ్ మేన్ చాలా మంచివాడు. ఇంటిని తన కంటికి రెప్పలా కాచుకుని చూసుకుంటాడు' అని చెప్పగానే ఇంకొకతను 'వాచ్ మేన్ మీ ఊరివాడా, బాగా తెలిసినవాడా' అని అడిగిన దానికి జవాబుగా మొదటి వ్యక్తి 'అవును, అతను... మునుపు ఈ ఇంటికి యజమాని!' అని జవాబివ్వటం జరుగుతుంది. ఇదీ ఎక్కువగా నవ్వించిన జోక్స్ లో రెండోదానిగా నిర్ణయించబడింది. ఈ జోక్ చెప్పిన వాళ్ళని పిలిచి వాళ్ళకీ అలాగే పాకెట్స్ ఇచ్చారు.

తర్వాత దామోదంగారు స్టేజి మీదకు వచ్చి అక్కడ కూర్చున్న అందర్నీ ఉద్దేశించి నాలుగు మాటలు చెప్పారు.

''నా స్వంతంగా ఈ నాలుగు మాటల్నీ చెప్పబోవటం లేదు. ఎక్కడో... ఎపుడో చదివిన, నాకు గుర్తున్న మాటల్నీ చెబుతాను. 'నవ్వు' అనేది మన మానసికస్థితిని మెరుగు పరచటమే కాకుండా ఆందోళననూ తగ్గిస్తుందట. నవ్వినపుడు మంచి ఎండార్ఫిన్ లు ఉత్పత్తి అయి మంచి అనుభూతినీ కలిగిస్తాయి. ఇమ్యూనిటీ పెరుగుతుంది! నవ్వు... శరీరం బరువు తగ్గడానికీ ఉపయోగపడుతుందట. ఒత్తిడి దూరం అయి బి.పి. కంట్రోల్ లోకి వస్తుందట! ఇవ్వన్నీ సర్వేలు చేసి పెద్దలు నిర్ధారించిన నిజాలే!

అందుకే ఈ రోజు సాయంకాలం మీకీ నవ్వుల విందును ఏర్పాటు చేసి మిమ్మల్నీ భాగస్వాముల్ని చేయగలిగాం. ఇలా వీలైనపుడంతా జోక్స్ చెప్పుకుంటూ హాయిగా నవ్వుకుంటూ కాలక్షేపం చేసేద్దాం!

ఇంకొకమాట! నేనసలు ఈ పూట... మా అబ్బాయి వివాహం జరిగిన సందర్భంగా ఇలా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మందునూ ఏర్పాటు చేయాలనుకున్నాను. అయితే మా పిల్లలు విచిత్రంగా వ్యతిరేకించారు. ఈ మధ్య ఒకరు 'మందులేని విందు' అనే నినాదాన్ని వ్యాపింపచేసే అభిప్రాయంతో ఒక సంస్థనూ ఏర్పాటుచేసి తమ అనుభవాలు కొన్ని చెప్పి సభ్యులుగా చేర్పిస్తున్నారట! మా ఇద్దరు అబ్బాయిలూ వారి మాటలు, సలహాలు నచ్చి ఆ నినాద వ్యాప్తికి సహకరిస్తామని సంతకాలు చేయటం జరిగిందని నాకు చెప్పారు.

పిల్లలు వాళ్ళే ఈ మందు అలవాటుకు స్వస్తి చెప్పే పనికి పూనుకుంటే, మంచి అలవాటుని నేనెలా కాదని అనగలనూ...? అందుకే ప్రత్యామ్నాయంగా ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేసాను. అందువలన కొందరు బంధుమిత్రుల్ని నిరాశకు గురిచేయాల్సి వచ్చింది. అందుకు నన్ను మన్నించమనీ కోరుతున్నాను...''

ఈ మాటలు చెబుతుండగానే స్టేజిమీదకు వచ్చిన ఒకరు దామోదరం గారి భుజంపై చేయి వేసి ''నేనూ ఓ రెండు మాటల్ని చెబుతాను...'' అన్నాడు.

"మందు విందుకు బదులుగా ఇలాంటి మంచి కార్యక్రమాల్ని ఏర్పాటు చేసిన మన మిత్రుడు దామోదరాన్ని అభినందిస్తున్నాను. మా పిల్లల పెళ్ళిళ్ళూ నిశ్చయమయ్యాయి. నేనూ దామోదరం చూపించిన ఈ దారిలోనే నడవాలని ఇపుడే నిర్ణయించుకున్నాను. కొత్త దురలవాట్లుకి స్వస్తి చెప్పి, మంచికి స్వాగతం చెబుదాం! మంచి అలవాటును ప్రోత్సహించాలి మనమందరం అని నా అభిప్రాయం. ఇంకా చెప్పాలంటే, ఇలా మన అందర్నీ కుటుంబాలతో ఆహ్వానించి... ఓ రెండు రోజులు అందరం కలిసి ఆనందంగా గడిపే అవకాశం కల్పించినందుకు, ఇలాంటి మంచి కార్యక్రమాలతో అలరించినందుకూ దామోదరానికీ, అతని పిల్లలకీ మనమే ధన్యవాదాలు చెప్పాలి! ఈ మాట చెప్పటానికే నేనీ స్టేజీమీదకు వచ్చాను!'' అని చెప్పాడు.

అందరూ కరతాళధ్వనులతో తమ ఆమోదాన్నీ, ఆనందాన్నీ తెలియజేశారు.

తర్వాత ఇంకో అతను స్టేజి మీదకు వచ్చి ''ఇక ఉదయం వధూవరులకు శుభాకాంక్షలు తెలియచేసిన వాటిలో వినూత్నమైనదీ, బాగున్నదని నిర్ణయించిన దానిలో ఓ విచిత్రం ఉంది. ఇద్దరు

తెలియజేసిన శుభాకాంక్షలు అక్షరం పొల్లు పోకుండా ఒకేలా ఉన్నాయి. మరి ఆ ఇద్దరూ ఒకే కుటుంబానికి చెందినవారో లేక పక్క పక్కనే కూర్చుని కలిసి రాశారో మాత్రం అర్థం కాలేదు... వాళ్ళ పేర్లు తర్వాత చెబుతాను... ముందుగా వాళ్ళు రాసిన వాక్యాలు ఏమిటో చదువుతాను...'' అంటూ అతను ఆ వాక్యాల్ని పైకి చదివాడు... కాగితం చూస్తూ...

'ప్రేమాను రాగాల పారిజాతాలు –

పరిమళించాలి నిత్యమూ మీ జీవితవనంలో...

ముద్దుమురిపాల మణిమాణిక్యాలు

దివ్వెలుగా నిలవాలి సదా మీ జీవనయానంలో...'

అని చదివాక ''ఇపుడు పేర్లు చెబుతాను...'' అంటూ 'వంశీకృష్ణ, సుమజ' అన్నాడు.

అప్రయత్నంగా వాళ్ళు ఇద్దరూ లేచి నిలబడ్డారు.

సుమజ వంశీ వైపు ఆశ్చర్యంగా చూస్తూ ''ఇది... ఇది... ఎలా జరిగింది? నేను రాస్తున్నది మీరు చూశారా...?'' అంది.

''సరిగా ఇదే మాట నేనూ మిమల్ని అడగాలని అనుకుంటున్నా. ఒకేలాంటి వాక్యాలు ఎలా రాయగలం...?'' అన్నాడు ఆలోచిస్తున్నట్లు మొహం పెట్టి.

వాళ్ళ వాదనని అర్థం చేసుకున్న స్టేజి మీదున్నతను ''అయితే మీరిద్దరూ ఒకే కుటుంబానికి చెందినవాళ్ళు కాదా...?'' అనడగ్గానే కాదన్నట్లు ఇద్దరూ తలలు అడ్డంగా వూపారు.

''అయితే ఏదో జరిగింది. ఇద్దరూ పక్క పక్కనే కూర్చుని రాసారు కాబోలు. ఎవరో ఒకరు వచ్చి ఇది తీసుకోండి...'' అన్నాడు పాకెట్టును పట్టుకుని చిరునవ్వుతో. మళ్ళీ ఇద్దరూ 'మీరే తీసుకోండి... మీరే...' అంటూ అనుకోవటం విని అతను 'ఫరవాలేదు... ఎవరో ఒకరు తీసుకుని వెళ్ళండి.... కొన్నాళ్ళు ఒకరిదగ్గర, మరికొన్నాళ్ళు ఇంకొకరి దగ్గర ఉంచుకుంటారో, ఏం చేస్తారో ఆలోచించుకుని నిర్ణయం తీసుకోవచ్చు. ఇదేదో బొమ్మలా అనిపిస్తోంది...' అంటూ అతను వివరణ కూడా ఇచ్చేసరికి వంశీ వెళ్ళి తీసుకున్నాడు.

'మీ గువ్వల జంట ఒకరికొకరు తోడుగా నిలిచి అందరికీ ఆదర్శంగా నాలవాలి' అని రాసి ఉన్న చీటీ చదివి, ఇంకొతతని పేరూ పిలిచి వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపిన వాళ్ళలో రెండో బహుమతిగా అందించటమూ జరిగింది. ఒక అబ్బాయి వెళ్ళి చిరునవ్వుతో వారిచ్చిన పేకెట్టును అందుకుని వచ్చి తన సీటులో కూర్చున్నాడు.

స్వంతంగా జోక్స్ ఎవరూ చెప్పలేదు కాబట్టి ఆ కేటగిరిని రద్దు చేసినట్లుగా స్టేజీపై నున్నతను చెప్పారు.

పాకెట్టు విప్పుతున్న  అతని వైపు చూస్తూ సుమజ అడిగింది. ''మీరు ... మీ పేరు వంశీమోహన్ అని ఇందాక చెప్పారుగా, ఇప్పుడు వా ళ్ళు మీ పేరును వంశీకృష్ణ అన్నారేమిటీ...?''

వంశీ చిన్నగా నవ్వి ''పేపరుపై అదే రాసాను కాబట్టి...'' అన్నాడు.

''అదే... ఎందుకూ అనడుగుతున్నా. లేకపోతే... మీ పేరు అదే అయినా మీరు అబద్ధం చెప్పారా...?''

''ఎందుకోగానీ... మీరన్నట్లుగా నా పేరును కృష్ణగానే మార్చేసుకుందామనిపించింది...'' అంటూ వంశీ చిన్నగా నవ్వాడు.

''అదేమిటీ... ఎందుకలా...?'' కొంచెం ఆశ్చర్యంగా చూసింది.

'అవునూ.. ఎందుకలా...?' అతను తననే తిరిగి ఆ మాట అడుగుతూంటే... సుమజ అతనివైపు చురుగ్గా చూసింది. ''అదేంటీ... మీరెందుకు చేశారో నన్నే అడగటం ఏమిటీ... మీరు కదా జవాబు చెప్పాల్సిందీ...?''

''నిజమేగానీ...'' అతను నిట్టూర్చాడు... ''నా మనసులోని మాటలు మీకే బాగా తెలుస్తున్నాయి కదాని మిమ్మలే అడిగాను. చూడండి... నేను రాసిందే సరిగ్గా మీరెలా రాయగలిగారూ... అంటే నా మనసులోకి మీరు వచ్చేశారన్నమాట. అంతేగా!'' అతను చిరునవ్వు చిందించేసరికి సుమజకు కొంచెం కోపం వచ్చింది.

''మీరు చెప్పింది చాలా అసహజంగా ఉంది! ఇదెలా జరిగిందో, నేను రాసిందే మీరెలా రాయగలిగారో... నా ఊహకు అందటం లేదు...!'' అంది ఆలోచనగా మొహం పెట్టి.

ఇంతలో వాళ్ళకి కొంచెం దూరంగా నిలబడినతను ''మోహనా'' అంటూ పిలవగానే వంశీ వెంటనే లేచి నిలబడి ''ఏమిటి మామయ్యా...'' అంటూ అతని దగ్గరకు వెళ్ళాడు.

ముకుందరావు సుమజ వైపు ఒక క్షణం పరిశీలనగా చూసి, స్వరం బాగా తగ్గించి మెల్లగా అన్నాడు ''అమ్మాయి చాలా బావుంది, వివరాలూ, అడ్రసూ కనుక్కో...!''

''ఎందుకూ...'' అని మళ్ళీ అన్నాడు. ''నువ్వేమో నన్ను ఒక్కడినీ వదిలి నీ ఫ్రెండ్స్ తో నీ కాలక్షేపం నువ్వు చూసుకున్నావు... ఈ అమ్మాయీ, తన ఫ్రెండ్స్ నాతో పరిచయం చేసుకుని కొంచెం కాలక్షేపంగా తోడుగా ఉన్నారు. ఈ రెండు రోజుల తర్వాత ఎవరికి ఎవరమో.. అడ్రసూ వగైరాలన్నీ మనకెందుకూ...!''

ఆయన గుంభనంగా చిన్నగా నవ్వాడు. ''నువ్వు అమాయకుడిలా మాట్లాడుతున్నావ్... నిజమేనని నమ్మమంటావా...? నువ్వు... ఎవరి రాతను చదివి... మధుర భావనలంటూ ఊహల్లో ఊరేగేవో... ఆ అమ్మాయే నీకు ఇక్కడ పరిచయం కావటం చాలా చిత్రంగా ఉందికదూ...! ఇందాక స్టేజి మీద నుండి వాళ్ళు 'సుమజ' అని పేరు చదవగానే నాకు అర్థమైపోయింది...! అందరూ తనని 'మజా' అని పిలుస్తారేమో... అందుకే మామిడిపండు బొమ్మ వేసి ఉంటుంది అని...!''

ముకుందరావు మాటలు పూర్తికాకముందే ''మామయ్యా... నువ్వు భలే కనిపెట్టేసావ్...! నేనిలా ఆలోచించలేకపోయానెందుకో....'' అంటూ ఆయన చేయి పట్టుకుని హుషారుగా ఊపేశాడు.

ఆయన అటూ ఇటూ చూస్తూ చేయి విడిపించుకుంటూ చిరునవ్వుతో ''సర్లేరా... నీకూ తెలిసే ఉంటుందనుకున్నా. మరి ఇద్దరూ ఒకేలా రాయగలగటానికి కారణం ఇదేగా...'' అన్నాడు.

''ఎలా అని ఆలోచిస్తున్నానే గానీ, ఇదీ విషయం అని ఊహించలేదు మామయ్యా... ఇపుడు అర్థమైపోయింది!'' అన్నాడు ఆనందంగా మోహం ఇంత చేసుకుని.

''సర్లే... అయితే, నేను చెప్పిన పనిమీద ఉండు...!'' అన్నాడాయన చిరునవ్వుతో.

వంశీ చిన్నగా నవ్వేసాడు.

ముకుందరావు అటు వెళ్తే, వంశీ మళ్ళీ తన కుర్చీ దగ్గరకు తిరిగి వచ్చాడు. కుర్చీలో పెట్టిన పాకెట్టును చేతిలోకి తీసుకుని కూర్చుంటుంటే, సుమజ ''ఆయనెవరూ'' అనడిగింది.

‘‘మా మామయ్య...! దామోదరంగారికి మా నాన్నలాగే ఆయనా స్నేహితుడే. నాన్న ఆ మధ్య చనిపోతే, అమ్మకి ఇక్కడకు రావటం ఇష్టం లేనందువల్ల నేనొక్కడినే రావటానికి నాకూ మనస్కరించలేదు! మా అమ్మ, మామయ్య నన్ను ఒప్పించి పంపించారు. ఇక్కడెవరూ నాకు పరిచయం లేదని నేను సాకు చెబితే, మామయ్యే తను తోడుగా ఉంటానంటూ నా అభ్యంతరాన్ని కొట్టేశాడు. వచ్చినందువల్లనే మీ పరిచయం కలిగింది! బావుంది!’’ అన్నాడు వంశీ, వివరాలన్నీ చెబుతూ.

‘‘అయితే... ఒక విషయంలో నా సందేహం తీరిపోయింది. మీ పూర్తి పేరు వంశీమోహనే అని నిర్ధారణ అయింది! మీ మామయ్య మిమ్మల్ని మోహన్ అని పిలిచారుకదా! వంశీకృష్ణ అని కాగితంమీద పొరపాటునే రాసి ఉంటారు అంతేగా...?’’

సుమ మాటలకు వంశీ తల అడ్డంగా వూపుతూ ‘‘పొరపాటున కాదు లెండి. చెప్పానుగా, కావాలనే రాసాను...!’’ అన్నాడు. తర్వాత పాకెట్టును పూర్తిగా విప్పుతూ ‘‘ఇది మన ఇద్దరికీ అని ఇచ్చారు. మీరసలు తాకనైనా లేదు...’’ అంటూ ఆ ప్యాకెట్టులోని విగ్రహాన్నిసుమజకు అందించాడు.

‘‘అబ్బ? ఎంత బావుందో ఈ బొమ్మ! కృష్ణ విగ్రహం చాలా అందంగా ఉంది!’’ అంది సుమజ ఇష్టంగా చూస్తూ.

అక్కడున్న అమ్మాయిలు కూడా ‘‘అవును.... కృష్ణుడు చాలా ముద్దొస్తున్నాడు...!’’ అన్నారు.

ఆ పాలరాతి కృష్ణ విగ్రహాన్ని సుమజ అతని చేతికి తిరిగి ఇచ్చేయబోతుంటే చేయి అడ్డం పెట్టి ‘‘అది మీ దగ్గిరే ఉండనివ్వండి... వాళ్ళూ అదే చెప్పారు కదా’’ అన్నాడు.

సుమజ ‘‘కానీ...’’ అంటూ అతనివైపు ఓ క్షణం సందేహంగా చూసి చెప్పింది. ‘‘మళ్ళీ ఎపుడు, ఎలా మీకు అందచేయాలీ... అదంతా ఎందుకుగానీ మీ దగ్గిరే ఉంచండి. బహుమతిని కూడా మీ పేరుకు తగ్గట్టుగా సెలక్టు చేశారు...!’’

సుమజతో పాటు అతనూ చిరునవ్వు నవ్వాడు.

‘‘మీ దగ్గర ఉండటమే సరియైనది. ఎందుకో ఏమిటో మీకు తర్వాత చెబుతాను...’’

‘‘ఏం.... ఇపుడే ఎందుకు చెప్పకూడదూ...?’’

''చెప్పొచ్చు. మళ్ళీ కలిసినపుడు చెబుదామని. అంతే. మీకున్నట్లు మళ్ళీ కలుస్తామో లేదో నన్న సందేహం నాకు లేదు. తప్పక కలుస్తామనే నమ్మకం ఉంది!''

అంత ఖచ్చితంగా చెప్పిన అతనివైపు నిశితంగా చూసిన సుమజ మౌనం వహించి వూరుకుంది.